కథానిక

# బారసాల

ఐ. వి. సూర్యనారాయణ

గోడకు తగిలించివున్న బోర్డు చూశా. అంతలో, ఒక దవాలీ బంట్రోతు కనుపించేడు. ఇదేయిల్లన్న నిశ్చయంతో కారు హారన్ ఒక్కసారి నొక్కి కారు దిగేను. ఎవరని అనుకున్నాడో నాకు తెలియదు. సాల్యూటు చేసి గేటు తెరిచేడు బంట్రోతు. లోపలకు అడుగు పెట్టా. చక్కటి సౌరభాన్ని వెదజల్లుతున్నాయి బొగడ చెట్లు. రంగు రంగుల గులాబులు నన్ను విస్తుపోయి చూస్తున్నాయి క్రొత్తగా. ఆలోచిస్తూనే రెండడుగులు వేశా. రెండు కుక్కలు - ఒకటి బొచ్చుది, రెండవది ఆల్ సేషియన్-బౌయ్ -బౌయ్ మంటూ స్వాగత మిచ్చేయి.

ప్రకాశరావుకి లేకలేక పాపాయి కలగడం వల్ల నామకరణ మహోత్సవమే వివాహం వలె సాగిస్తున్నాడు. గదిలో కిటికీ దగ్గర నిలబడి కాఫీ తాగుతున్నాను. దొడ్లో లేగదూడ బాగా పాలు తాగి చంగు చంగున గంతులేస్తోంది. మే నెల సూర్యుడు తన కాంతులు అప్పుడే చిగిరిస్తున్న చింతచెట్టు కొమ్మలగుండా ప్రసరింపజేస్తూ ఆ ప్రదేశమంతా సువర్ణమయంగా చేస్తున్నాడు.

ఒక పురోహిత బ్రాహ్మణుడు గుమ్మం దగ్గర నిలబడి "ఏం...ఏమమ్మా ఇంకా తెమలరేం... టైము చూచారా లేదా...యీ కాస్త సుముహూర్తపు ఘడియలు దాటిపోయిందాకానేమిటి?" అంటున్నాడు.

ఆయనకు అరవై యేళ్ళుంటాయి. కొంచెం పొడవైన మనిషి. కండలు తిరిగిన ఛాతీ. ఒకపంచీ, ఒక లాల్చీ తొడుక్కొని జరిగేదంతా చూస్తూ అందుకొన్నా డాయన. "ఆడవాళ్ళు ఎప్పుడూ యింతేనండీ. సామెత వుండనే వుంది. అమ్మగారు అలంకరించుకొనే టప్పటికి వూరు మాటు మణిగిపోతుందని" అన్నాడు. ఆయన ప్రకాశరావు మామగారు.

అంతట్లో ప్రకాశరావు బావమరది రోజుకుంటూ లోపలకు పరుగెత్తేడు. అందరినీ కొంచెం కదలవేయటం మంచిదని.

కొన్ని బాతులు వరుసగా ఒకదాని వెనుక ఒకటి నడుస్తూ మధ్య మధ్య మనుష్యులు చెప్పుకొనే మాటలు వినడానికి కాబోలు, ఆగిపోయి తిరిగి తమ వయ్యారి నడకలతో దొడ్లో వున్న నీళ్ళ దొరువులోకి పోతున్నాయి.

మల్లె మొగ్గల వాసన గుప్పున కొట్టింది. అటు తిరిగిచూశా. కమలమ్మ చిరునగవుతో వస్తోంది. తెల్లని టర్కిష్ తువ్వాలులోనున్న మూడు నెలల పసికందు ఆమె ఉన్నత వక్షం మీద కునికిపాట్లు తీస్తోంది. వెనకాలే యిద్దరు అమ్మమ్మలు వార్ధక్యంలో ముసి ముసినవ్వులు నవ్వుకుంటూ వస్తూన్నారు.

'అయం ముహూర్తమస్తు- సుముహూర్తమస్తు' అంటూ బ్రాహ్మణులు శ్లోకాలారంభించారు. తతంగమంతా నడిచిపోయింది. పేరు పెట్టాలి. అందరూ ఒకరి ముఖాలొకరు చూచుకొంటున్నారు, ఏం పేరు పెడతారో అని.

దొడ్లో పనిచేసే దాసీది ఆవుకి నీళ్ళయినా పెట్టక ఆ బాల్చీ అక్కడే పారేసి గుమ్మం లోంచి తొంగి తొంగి చూస్తోంది. కుక్కలు కూడా అప్పుడప్పుడు పిల్లలు వేసే బిస్కటు ముక్కలు తింటూ తమ నల్లటి గుడ్లను అటూ యిటూ తిప్పుతూ తదేక దీక్షతో చూస్తున్నాయి.

ఈ అమ్మమ్మ పేరో, ఆ అమ్మమ్మ పేరో పెడతారని అందరూ అనుకొంటున్నారు. ఇద్దరూ బతికి ఉండగా ఎవరి పేరు పెడితే ఏం గొడవ వస్తుందో అని తెలివి తేటలుగా ప్రకాశరావు అమ్మాయికి రాణి బాల అని నామకరణం చేశాడు. అందరూ సంతోషించేరు.

బారసాల జరుగుతున్నంత సేపూ విజయ వదినగారి వెనకాతలే తిరుగుతూ వుంది. ఆమె సౌందర్యమూర్తి అని చెప్పి తీరాలి. ఆనందకిసలయమురై మొలకలెత్తు యీమె యౌవనభావములు జిలుగు వెలుగుల నీలిచీర మాటున తొంగిచూడసాగేయి. భావకవైతే కావ్యం వ్రాసేవాడే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమెను చూస్తే ఎంతటి ఋష్యశృంగుడైనా చలించవలసినవాడే. అప్పుడప్పుడు కమలమ్మ కార్యాంతరాలమీద పది నిమిషాలపాటు అలా వెళ్ళవలసివుంటే 'ఇలా నా చేతికి యియ్యవమ్మా, వదినా' అని విజయ పాపాయిని చేరదీసేది.

* * *

రాత్రి డిన్నరు. వచ్చేవాళ్ళందరూ వస్తున్నారు. కమలమ్మ అందరినీ ఆహ్వానిస్తూ తెరపిలేకుండా వుంది. విజయ పాపాయిని తన ఒడిలోకి తీసుకొని ముద్దులాడుతోంది. ఆమె నీలివర్ణపు చీర, రాణిబాల తెల్లటి దుస్తులు చూస్తుంటే అక్కడక్కడ తెల్లటి మేఘశకలాలతో కూడుకొన్న వినీల నిర్మలాకాశంతోచేది. అందామె ముఖమండలం చంద్రబింబమయ్యేది.

అలవాటు లేదేమో సుళువుగా ఎత్తుకోలేక చిన్న మూటలాగ పాపాయిని హృదయానికి చేర్చింది. ఆమె సరిగ్గా ఎత్తుకోలేకపోవడం చూచి చుట్టూవున్న ఆడవాళ్ళంతా నవ్వేరు. ఒక అమ్మమ్మ "నీకు అలవాటు లేదే అమ్మా" అంది. ఇంకో ఆవిడ కొంచెం కరుకుగా "దాని ముఖాన ఆ రాతే ఏడిస్తే యీ ఖర్మ ఎలా పడుతుంది" అంది.

విజయ మాట్లాడలేదు. అచ్చటినుంచి పోయి వరండాలో కూర్చుంది. ఈసారి పాపాయిని మరింత హృదయానికి చేర్చుకుంది. ఆ చిన్ని నల్లని కళ్ళను అదేపనిగా పరీక్షించడం మొదలు పెట్టింది. రాణిబాల యిందాకటినుంచీ కాళ్ళతో యేవేవో చెప్పింది. కాళ్ళు లాగేయి. ఇంక చేతులతో చెప్పడం మొదలు పెట్టింది "ఈ సృష్టిలో పరిపూర్ణత యెక్కడిది" అని. రాణిబాలకు ఏమని తోచేదో, అప్పుడప్పుడు మధ్యమధ్య తన చిన్ని చేతులతో విజయ బుగ్గలమీద తట్టేది.

ఈర్ష్యాకషాయరోచిస్సులు వెలిగక్కే పెద్దవారి ముఖాలకన్న, ముద్దులు గుమ్మరించే యీ పసిపాప మోములోనే విజయకు ప్రశాంతి కనిపించింది. రాణిబాల బుగ్గలను చూస్తూంటే విజయకు ముద్దుపెట్టుకోవాలనిపించింది. ఎవరైనా చూస్తే ఏమని ఆడిపోసుకుంటారో అని భయంవేసింది. అణగారిన ఆశలన్నీ అనంతసాగరంలాగ ఆమెను ఆవరించేయి. తన కోరికను కాదనలేకపోయింది. నెమ్మదిగా పైకి లేవనెత్తి పాపాయి రెండుబుగ్గలూ మృదువుగా ముద్దు పెట్టుకొంది.

అవతల భోజనాలు అవుతున్నాయి. "ఏముంది-యీ కాలం పెళ్ళిళ్ళు, బారసాలలు క్షణికాలేగా" అన్నాడొకాయన.

అంతటితో బాల్యవివాహాలు, అయిదు రోజుల పెళ్ళిళ్ళు, ఒకరోజు పెళ్ళిళ్ళు, శారదా బిల్లు, విడాకులు- ఒకటేమిటి, వివాహాలకు సంబంధించిన విషయాలన్నీ చర్చింపబడవలసిందేగా. కొందరు పడుచుకుర్రాళ్లు సనాతనుల భావాలు వింటూ ఒకళ్ల 'ముఖాలొకరు చూచుకొంటున్నారు. ఆరుబయట వెన్నెలలో భోజనాలు చేసిన చిన్నపిల్లలు దాగుడుమూతలాడుకొంటున్నారు. కిసలయాలను తిన్నకోయిల కమ్మని గొంతుకతో కూస్తోంది. వేళాకోళంగా, ధ్వనికి ప్రతిధ్వని అన్నట్టుగా, పిల్లలు మళ్ళీ కూస్తున్నారు.

విజయ పాపాయిని నవ్వించాలని పలుపాట్లు పడుతోంది. తన వేలితో చిన్ని నోటి క్రింద కితకితలు పెట్టింది. పాపాయి కిలకిలా నవ్వి వూరుకుంది. ఈసారి ఆ మౌనముద్రలో ఆశాపథాంతరాళాలు కన్పించాయామెకు. అదొక వింతయైన వినూత్నానందాన్ని ఒనగూర్చింది. కాని వెనువెంటనే విపరీత విషాదచ్ఛాయ—రాణి బాల తన అన్నగారి కూతురు......

ఎంతసేపో ఆనల్లని కళ్ళను, ఉబ్బెత్తుగానున్న వూదారంగు బుగ్గలను చూస్తుంటే యేదోబంధం లేని అనుబంధం వారిద్దరి మధ్యా యేర్పడింది. విజయ తన్నుతాను మర్చిపోయేది. తేలికైనటువంటి తియ్యని పవిత్రమైన వెచ్చదనం పాపాయి చుట్టు నున్న తెల్లని గుడ్డలు దాటి ఆమె

ఆపాదమస్తకము ప్రాకి తేనెలు నింపింది. ఆ తియ్యని పవిత్రమైన వెచ్చదనమే ఆమె కనుల నుండి కన్నీటిబిందు వొలకచేసింది.

కొద్దికొద్దిగా భోజనాలదగ్గర నవ్వులు, మాటలు అధికం కావడం మొదలుపెట్టాయి. ఎందుకో అందరూ ఒక్కసారి గొల్లున నవ్వేరు. దాంతో పాపాయి కొంచెం భయపడి యేడవడం మొదలు పెట్టింది. అంతటితో కమలమ్మ వచ్చి పిల్లను తీసుకువెళ్లి ఆ పక్కనున్నగదిలో పడుకోబెట్టి నవ్వుతూ తిరిగి వచ్చింది.

భోజనాలయాయి. అందరూ తమలపాకులు నములుతూ లోకాభిరామాయణం మొదలు బెట్టారు. చాలా సేపటినుంచి విజయ కనుపించడం లేదు. ఎవరూ గుర్తించనైనా లేదు.

నెమ్మదిగా గది చేరుకుందామని బయలు దేరాను. కొత్తకావడంవల్ల లైటుకోసం తడుముకుం టున్నా. నాకేదో వింతశబ్దం వినవచ్చింది. కొంచం పక్కగా ఒరిగి స్విచ్చి అందుకొని లైటు వేశాను. గాలి బాగా వస్తుందని ఎవరూ రారని కమలమ్మ పాపాయిని నా గదిలో మంచంమీద పడుకోబెట్టింది. ఆ ప్రక్కనే పాపాయి తలగడమీద ముఖంపెట్టి వెక్కివెక్కి యేడుస్తున్న విజయ. తిరిగి బయటి వెన్నెలలోకి వచ్చా. అంతా అంధకారంలా కనుపించింది...

నాకళ్లు అప్రయత్నంగా తడిశాయి. వెనుకటికి ప్రకాశరావు వ్రాసినలేఖ జ్ఞప్తికివచ్చింది. విజయను వాళ్ళనాన్న అందరిలాగ కాక ఎం. బి., బి.ఎస్. పాసైన జగన్మోహనునికిచ్చి వివాహం చేశాడు. అతను యుద్ధంలో కెప్టెన్ క్రింద చేరాడు. కాలం గడిచింది. అతను సింగపూరులో బందీ అయినాడని లేఖ వచ్చింది. వెనువెంటనే అతని అకాలమరణ వార్త. ఆమెకు అంతే తెలుసు.

ఉత్కృష్ట సౌందర్యస్వరూపమైన ఆమె జీవితం నిర్జలభూమిలో నూయి త్రవ్వినట్లయింది. సౌందర్యోపాసనామయమైన ఆమె బ్రతుకు అందానికే దూరమైంది. ఆమెలో నేడు పొడ జూపుచున్న యీ అవ్యక్తవాంఛకు యీ తీరని కోరికకు యేమని నామకరణం చెయ్యాలో నాకేమి తెలిసిందికాదు...ఏమని నామకరణం చెయ్యను?

# ప్రేమ—పెండ్లి—విడాకులు

గోగినేని ఉమామహేశ్వరరావు

వివాహాలవిషయంలో నా అభిప్రాయాలను పురస్కరించుకొని జూన్ 24 వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో వ్యాఖ్యానం ఉన్నది. స్థలాభావానికి వెరచి క్లుప్తంగా వ్రాయడం వల్లనేమో రచయితకు నాభావాలు అసంపూర్తిగా తోచినట్లున్నది. "ఆంధ్రప్రభ" 1-5-49 సంచికలో "ప్రేమించి పెండ్లి లేక పెండ్లాడి ప్రేమ" అన్న నా వ్యాసానికి అనుబంధంగా చదువుకుంటే మరింత విశదంగా ఉండవచ్చు.

ఆదర్శాలను వల్లించడం సులభమే. కాని ఆచరణలో కదా అసలురంగు తేలేది! వాస్తవికంగా చూస్తే ఈ రోజులలో కామానికి ప్రేమ అన్న ఘరానా పదం పరిపాటి అయిపోయింది. ఊహాగానాలతో ఉవ్విళ్లూరుతూ ఉబ్బి తబ్బిబ్బులై అందని ఆదర్శాలను ఆదేపనిగా ఉద్ఘాటించి ఫలితం లేదు. అందం చూసి అర్రుచాచి ఆరాటపడడం ప్రేమ అనడం అపచారం కాదా! ప్రేమకూ అందానికీ సంబంధమే లేదు. కామమూ, అందమూ మాత్రమే కలిసికట్టుగా వుంటాయి. "తా వలచింది రంభ" అన్న సామెతలోనే ఈ భావం స్ఫురిస్తున్నది. "కాకిపిల్ల కాకికి ముద్దు" అనడంలో అప్యాయం ఉన్నప్పుడు అందం అప్రధానమే అనికదా భావం! అందమే ప్రధానంగా పెట్టుకొన్న ప్రేమ అవసరం తీర్చుకొనే